

ఉద్యోగులకు తీపికబురు

● 3 శాతం డీఏ పెంచుతూ సీఎం స్టాలిన్ ఉత్తర్వులు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురందించింది. ఈ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 3 శాతం కరవు భత్యాన్ని (డీఏ) పెంచుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఆదేశించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లుగానే రాష్ట్రంలోనూ ఉద్యోగులకు కరవు భత్యాన్ని పెంచాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు ప్రస్తుతం ఉద్యోగులు, ఉపాధ్యాయులు పొందుతున్న 55 శాతం కరవు భత్యాన్ని 58 శాతానికి పెంచి, ఈ యేడాది జూన్ ఒకటో తేదీ నుండి వర్తింపజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కరవు భత్యం పెంపు కారణంగా ప్రభుత్వానికి ప్రతియేటా రూ.1869 కోట్ల మేరకు అదనపు వ్యయభారం పడుతుందని పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'తోళి' వసతి గృహాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అన్నా పట్టు విక్రయ కేంద్రం ప్రారంభం

కాంచీపురంలోని వళ్లల్ పచ్చయప్పన్ రోడ్డులోని కాంచీపురం అరింజర్ అన్నా పట్టు చేనేత కార్మికుల సహకార సంఘం అనుబంధంగా పనిచేస్తున్న, రూ.3 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన అన్నా పట్టు విక్రయ కేంద్రాన్ని సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి ఆర్ గాంధీ, చేనేత ఖద్దరు శాఖల కార్యదర్శి వి.అముదవల్లి, చేనేత శాఖ సంచాలకులు మహేశ్వరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో 214 మంది నియామకం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో టీఎన్‌పీఎస్సీ, వైద్య సిబ్బంది ఎంపిక సంస్థ ద్వారా ఎంపికైన 214 మందికి సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆ సందర్భంగా క్యాన్సర్ నిరోధక, సంరక్షణ పథకం కింద మహిళల కోసం సంచార క్యాన్సర్ చికిత్సాలయాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ మెమోగ్రాఫీ, ఈసీజీ పరికరం, సెమీ ఆటో అనలైజర్ పరికరాలను ఆయన పరిశీలించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆ సంచార క్యాన్సర్ చికిత్సాలయం పనితీరు వివరించారు. రూ. 40 కోట్లతో ఈ సంచార క్యాన్సర్ చికిత్సాలయాలను త్వరలోనే నడుపనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, భారతీయ వైద్యం, హోమియోపతి కమిషనర్ ఎం.విజయలక్ష్మి, వైద్య సిబ్బంది ఎంపిక బోర్డు అధ్యక్షురాలు ఉమా మహేశ్వరి, జాతీయ ఆరోగ్య సంక్షేమ సంస్థ సంచాలకులు డాక్టర్ ఎ.అరుణ్ తంబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

12 'తోళి' వసతి గృహాలకు శంకుస్థాపన...

సామాజిక సంక్షేమం, మహిళా సాధికారిక శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉదయం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 12 'తోళి' వసతి గృహాల నిర్మాణానికి ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. రూ.62.51 కోట్లతో 740 మంది వర్కింగ్ ఉమెన్స్ కోసం నిర్మించనున్న 12 'తోళి వసతిగృహాలకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఇదేవిధంగా కోయంబత్తూరు 'హూంజోలై' ప్రభుత్వ ఆదర్శ గృహం, తిరుచ్చిలోని ప్రభుత్వ ఆదర్శగృహాల వద్ద రూ.27.90 కోట్లతో నిర్మించనున్న అదనపు భవనాలకు కూడా శంకుస్థాపన చేశారు. చెన్నై రాయపురంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో నిర్మించిన చిల్డ్రన్స్ హోమ్‌కు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, శిశు సంక్షేమ శాఖ, ప్రత్యేక సేవల శాఖ సంచాలకులు శరణ్యా హరి తదితరులు పాల్గొన్నారు.



హర్మన్‌ప్రీత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు మరియ జీనాజాన్సన్, మేరీ జాన్సన్

హర్మన్‌ప్రీత్‌కు ఘన సత్కారం

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్ కప్ సొంతం చేసుకున్న భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను నగరంలోని సత్యభామ డీమ్డ్ యూనివర్శిటీ యాజమాన్యం గురువారం ఘనంగా సత్కరించింది. వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ మరియా జీనాజాన్సన్, ఛైర్మన్ మేరీ జాన్సన్ కలిసి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా ఎంజే ఇండోర్ స్టేడియంను ప్రారంభించి హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. మహిళా వన్డే వరల్డ్ కప్ పోటీలో భారత్ తరుపున పాల్గొని విశ్వవిజేతగా నిలచిన జట్టుకు తాను సారథ్యం వహించడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని తెలిపారు. తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం తనకెంతో సంతోషం కలిగించిందని తెలిపారు.

ఈసారి పొంగల్ కానుక రూ. 5వేలు ?

● పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రేషన్ కార్డు దారులకు పొంగల్ కానుకగా రూ. 5వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు సమాచారం. 2026 జనవరి రెండో వారంలో జరుపుకోనున్న పొంగల్ పండుగ సందర్భంగా రేషన్‌కార్డుదారులకు పండుగ కానుకగా రూ. 5వేలు అందజేసే అంశంపై ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆదాయ పన్ను చెల్లిస్తున్న రాష్ట్ర, కేంద్రప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, చక్కెర కార్డు దారులు పొంగల్ నగదు పొందలేరు. అయితే ఉచిత బియ్యం పొందుతున్న రేషన్‌కార్డుదారులకు చౌకదుకాణాల ద్వారా ఈ నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిసింది. పొంగల్ సందర్భంగా ప్రతి సంవత్సరం లాగే కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, ఒక చెరకుగడ, బెల్లంతో కూడిన కిట్ పంపిణీ జరుగుతుంది. పొంగల్ కోసం తయారుచేసిన చీర, ధోవతులను అన్ని జిల్లాల్లోని పౌరసరఫరాల ప్రధాన కార్యాలయాలకు మరో రెండువారాల్లో తరలించే అవకాశముందని అధికారులు తెలిపారు. కాగా, రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు, రాయితీలు, కొత్త పథకాలకు భారీగా నిధులు కేటాయించింది. ఇందువల్ల ఆర్థిక వనరుల పెంపుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇదిలా వుండగా, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం మేరకు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పొంగల్ కానుకగా అర్హులైన రేషన్‌కార్డుదారులకు పొంగల్ సరుకుల కిట్‌తో పాటు రూ.5వేలు నగదు పంపిణీ చేయడంపై ప్రభుత్వం మరికొన్ని రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది.

● కలైంజర్ సాధికారిక పథకం..

అర్హులైన వారిని ఎంపిక చేయండి

● డీఎంకే శ్రేణులకు స్టాలిన్ ఆదేశం

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని పార్టీ శ్రేణులకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ అన్ని అర్హతలు కలిగి ప్రతి నెలా రూ.1000లను పొందలేని గృహిణుల వివరాలను కనుగొని పార్టీ అధిష్టానవర్గానికి సమాచారం అందించాలని, ఆ తర్వాత వారికి కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా అన్నా అరివాలయంలో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేసే విధంగా స్టాలిన్ సాత్తూరు, బోడినాయకనూరు నియోజకవర్గం ఇన్‌చార్జులతో సమీక్షలు జరిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

● ముగిసిన సమతా ఇష్టి



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి అర్చన చేస్తున్న చిన్నజీయర్ స్వామి

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాప్తాహ్నిక పంచ కుండాత్మక 'సమతా ఇష్టి' ప్రత్యేక ఆధ్మాతిక కార్యక్రమం గురువారం శ్రీనివాస కల్యాణోత్సవంతో ముగిసింది. పెరంబూర్‌లోని ఎస్పీఆర్ సిటీలో ఈ నెల 6వ తేది త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా అంకురార్పణంతో వారంరోజుల ఆధ్యాత్మిక పండుగ ప్రారంభమైంది. ఈ వేడుకల్లో ప్రతిరోజు ఉదయం సుదర్శన నృసింహ ఇష్టి, వైనతేయ ఇష్టి, హయగ్రీవ ఇష్టి, పరమేష్టి (ధన్వంతరి హోమం) విష్వక్సేన ఇష్టి, లక్ష్మీనారాయణ ఇష్టి, చివరి రోజు శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ పూజలతో పాటు గోపూజా, లక్ష్మీ పూజ, వేంకటేశ్వరపూజ, తీర్థగోష్టి, పూర్ణాహుతి, విష్ణుసహస్రనామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్మాతిక ప్రవచనం, తిరుమంజనం, నామసంకీర్తనం, రామానుజ నూట్రాండి సామూహిక పారాయణం, ఆధ్యాత్మిక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, మంత్రదీక్ష, శోభాయాత్ర, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో సమతా ఇష్టి సేవా కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ వైభవంలో దేశంలోని సుమారు 3వేలకు పైగా గ్రామాలకు చెందిన లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. చివరి రోజైన గురువారం ఉదయం పూజల అనంతరం 11 గంటలకు మహా పూర్ణాహుతి, శ్రీనివాస కల్యాణోత్సవాన్ని చిన్నజీయర్‌స్వామి అత్యంత వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)- చెన్నై అధ్యక్షులు పి.రవీంద్రకుమార్ రెడ్డి, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గోపురం కుంకుమ తయారీ సంస్థ అధినేత వైవీ.హరికృష్ణ, టీటీడీ చెన్నై సలహామండలి మాజీ అధ్యక్షులు కె.ఆనంద్‌కుమార్ రెడ్డి, మాజీ సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, కె.రాజేంద్రన్, ఎస్‌కేపీడీ ట్రస్టీ ఎస్ఎల్ సుదర్శనం, వేదపండితులు, భక్తులతో వేదిక ప్రాంగణం కిటకిటలాడింది. చివరగా భక్తులందరికి తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

19న రాష్ట్రానికి ప్రధాని మోదీ

● కోవై సేంద్రియ రైతు సదస్సుకు హాజరు



చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం ఈ నెల 19న కోయంబత్తూరుకు విచ్చేయనున్నారు. కోవైలో నిర్వహించనున్న దక్షిణ భారత సేంద్రియ రైతు సదస్సులో ఆయన పాల్గొనున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. నగరంలో గురువారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం సేంద్రియ రైతుల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కోయంబత్తూరులో ఈ రైతుల సదస్సు జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో మోదీ పాల్గొని 50 మందికి పైగా వ్యవసాయ వైజ్ఞానిక నిపుణులతో చర్చిస్తారని చెప్పారు. కర్ణాటకలో తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న విషయం వాస్తవమేనని, తాను కష్టపడి సంపాదిస్తున్నానే తప్ప అక్రమార్జనలకు అవినీతికి పాల్పటం లేదని అన్నామలై వివరణ ఇచ్చారు.

తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు ?

● హెచ్చరించిన వాతావరణ కేంద్రం ● చేపలవేటపై నిషేధం

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో జాలర్లు వెంటనే తీరానికి చేరుకోవాలని అధికారులు ప్రకటించారు. తూత్తుకుడి, రామనాథపురం జిల్లాల సముద్రతీరాల్లో బలమైన మేఘాలు ఏర్పడ్డాయని, ఈ కారణంగా, అతి భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అదే సమయంలో, సముద్రంలో గంటకు 55 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో, తూత్తుకుడి జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. అలాగే, చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని జాలర్లను అధికారులు హెచ్చరించారు.



తీరానికే పరిమితమైన పడవలు

మూడు బిల్లులకు

గవర్నర్ ఆమోదం



గవర్నర్ ఆర్.ఎస్.రవి

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆమోదం పొందిన మూడు బిల్లులను తొమ్మిది నెలల అనంతరం గవర్నర్ ఆర్ ఎన్ రవి ఆమోదించారు. అధికార డీఎంకే ప్రభుత్వం గవర్నర్ మధ్య అభిప్రాయ భేదాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే బిల్లులను సకాలంలో గవర్నర ఆమోదించడం లేదని అధికార పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది. అదే సమయంలో, తాను రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తూ బిల్లులకు ఆమోదం తెలుపుతున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ఆ మేరకు, ఇటీవల గవర్నర్ ఆమోదించిన, పెండింగ్‌లో ఉన్న బిల్లులపై రాజ్ భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, శాసనసభలో ఆమోదించిన మూడు తీర్మానాలకు గవర్నర్ తొమ్మిది నెలల అనంతరం ఆమోదించారు. ఆ ప్రకారం, ప్రతినిధుల పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు నియమించిన అధికారుల పదవీ కాలం పొడిగింపు, తమిళనాడు పంచాయతీల 5వ సవరణ, స్థానిక సంస్థల అధికారుల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగింపు తదితర మూడు బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు రాజ్ భవన్ ప్రకటన విడుదల చేసింది.

రజనీ నివాసం సహా

ఏడుగురి ఇళ్లకు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోయెస్‌గార్డెన్ వద్దనున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ నివాసం సహా ఏడుగురు ప్రముఖుల నివాసాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఈ మెయిల్‌లో రజనీకాంత్, సినీ దర్శకుడు కేఎస్ రవికుమార్, టీవీకే నేత విజయ్ తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నేత హెచ్‌రాజా, మరో ఇద్దరు నటీమణుల నివాసాల్లో బాంబులు పేలనున్నాయంటూ బెదరింపు వచ్చింది.. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎక్కడా బాంబులు లేవని, ఉత్తుత్తి బెదిరింపేనని నిర్ధారణ చేశారు..

ఢిల్లీ పేలుడు ఎఫెక్ట్!

రాష్ట్రంలో ఉత్తరాది యువకులపై నిఘా

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పేలుడు సంభవించడంతో పాటు జమ్మూకశ్మీర్ తదితర ప్రాంతాలకు చెందిన యువకులు తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలడంతో రాష్ట్రంలో వున్న ఉత్తరాది యువకుల కదలికలపై పోలీసులు నిఘా వేశారు. ఈ నెల 10 నుంచి రాష్ట్రంలో హైఅలెర్ట్ ప్రకటించిన పోలీసులు.. వాహనాల తనిఖీ, లాడ్జీల్లో సోదాలు చేస్తున్న విషయం తెలిసిందే. చెన్నై, కోవై వంటి నగరాల్లో అధిక సంఖ్యలో బసచేస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులను విచారిస్తున్నారు. గత జూన్‌లో చెంగల్పట్టు వద్ద బసచేస్తూ మానవ బాంబుగా మారి దాడులకు పాల్పడేందుకు పథకం వేసుకున్న బిహార్‌కు చెందిన అకల్తూర్ అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అకల్తూర్ పెయింటింగ్ పనులు చేస్తూనే ఆక్రమిత కశ్మీర్‌లో పనిచేస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థల నేతలతో సంబంధాలు పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇదేరీతిలో ఉత్తరాది యువకుల గురించి ఆరా తీస్తున్నారు. ఉత్తరాది కార్మికులు అత్యధిగా ఉన్న తిరుప్పూరులోనూ పోలీసులు వారిపై తీవ్ర నిఘా వేస్తున్నారు. బిహార్ యువకుల ఆధార్‌కార్డ్, బ్యాంక్ వివరాలను పరిశీలిస్తున్నారు. తిరుప్పూరు నగరమంతటా గత రెండు రోజులు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

'సర్' ఫారాలను డీఎంకే శ్రేణులు పూరించడం తప్పా?

● ప్రశ్నించిన మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలియని వారికి ఎస్ఐఆర్ ఫారాలను డీఎంకే శ్రేణులు పూర్తిచేయడం తప్పా అని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ప్రశ్నించారు. ఈ నెల 9వ తేదీ తన జన్మదినం సందర్భంగా టీటీడీలో ఒక రోజు అన్నదానం కోసం రూ.44లక్షలు కేఎన్ నెహ్రూ విరాళంగా అందజేసిన వ్యవహారం సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో, తిరుచ్చి ముక్కొంబు కావేరి, కొళ్లిడం చెరువుల్లో గురువారం సుమారు 4లక్షల చేపపిల్లలను విడిచే కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అప్పావుతో కలిసి మంత్రి కేఎన్ నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి కేఎన్ నెహ్రూ సమాధానమిచ్చారు. సర్‌ను డీఎంకే వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఎస్ఐఆర్ ఫారాలను రాష్ట్రంలోని పలు ప్రాంతంలో డీఎంకే కార్యకర్తలు పూర్తిచేయడంపై సమాధానమిస్తూ తెలియని వారికి ఎస్ఐఆర్ ఫారాలను డీఎంకే శ్రేణులు పూర్తిచేయడం తప్పా అని మంత్రి ప్రశ్నించారు. తాజాగా రాజకీయాల్లోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్ గత నాలుగున్నరేళ్లుగా డీఎంకే ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరిశీలించాలని, అలా చేయకుండా ప్రభుత్వంపై బురద చల్లేవిధంగా మాట్లాడడం సరికాదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేఎన్ నెహ్రూ

ఐదు కోట్ల ఎస్ఐఆర్ ఫారాల వినియోగం

రాష్ట్రంలో 5 కోట్లకు పైగా ఎస్ఐఆర్ ఫారాలను వినియోగించినట్లు ఎన్నికల కమిషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో గత నెల 27 వరకు సుమారు 6,41,14,587 మంది ఓటర్లుండగా, ఇప్పటివరకు 5,00,67,045 (78.09శాతం) ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేసినట్లు ఈసీ తెలిపింది. రాష్ట్రంలో 68,467 పోలింగ్ బూత్‌ల అధికారులు, 2,11,445 మంది బీఎల్‌వోలు ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్)పనుల్లో పాల్గొంటున్నట్లు ఈసీ తెలిపింది.

16న 'సర్'కు వ్యతిరేకంగా టీవీకే మహా ధర్నా



టీవీకే అధినేత విజయ్

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) చేపట్టిన కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ)కు వ్యతిరేకంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నా నిర్వహించే అవకాశమున్నట్లు తమిళగ వెట్రి కళగం (టీవీకే) వర్గాలు తెలిపాయి. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఈ నెల 4 నుండి ప్రారంభించిన సర్ ప్రక్రియ నెల రోజుల పాటు జరుగుతుందని ఈసీ తెలిపింది. ఇందుకు ఇండియా కూటమిలోని డీఎంకే, కాంగ్రెస్ తదితర పార్టీలు వ్యతిరేకత తెలిపాయి. అయితే ఎన్డీయే కూటమిలోని అన్నాడీఎంకే, బీజేపీ, తదితర పార్టీలు సర్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, ఈసీ వైఖరికి నిసనగా ఇటీవల డీఎంకే నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ధర్నాలో మిత్రపక్షాలు కూడా పాల్గొన్నాయి. సర్‌కు వ్యతిరేకంగా డీఎంకే తరుపున దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈసీకి మద్దతుగా ఉత్తర్వులు జారీచేసింది. ఇదిలా వుండగా, సర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేదీ అన్ని జిల్లాల కేంద్రాల్లో టీవీకే తరుపున ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో ఐటీ కారిడార్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు తెలిపింది.

ఐటీ కారిడార్: ఎంసీఎన్ నగర్, ఎక్స్‌టెన్షన్, ఫౌండరీ రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, ఎస్బీఐ కాలని, గంగైఅమ్మన్ ఆలయ వీధి, 200 అడుగుల రోడ్డు, పోస్టాఫీసు వీధి, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, తేరడి వీధి, పంచాయతి రోడ్డు, సాయి నగర్, మాబుల్ అవెన్యూ, సెల్వగణపతి అవెన్యూ, శరవణ నగర్, సెల్వకుమార్ అవెన్యూ, శివరామ్, తనికాచలం వీధి, రామచంద్రన్ వీధి, కామరాజ్ వీధి, ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు, ఎంజీ రోడ్డు, బాలవినాయగర్ అవెన్యూ, ప్రకాశం వీధి, ఎల్లియమ్మన్ నగర్, శ్రీపురం రోడ్డు, రామన్ నగర్, ఓఎంఆర్, తిరుమలై నగర్ అనెక్స్, రామప్ప నగర్, సీబీఐ కాలని, రాజీవ్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, ఐబిటీ కాలని, మీనాక్షి పురం, మనోహర్ నగర్, వీజీపీ శాంతి నగర్.

50 వేల మందికి అందని 'సర్' ఫారాలు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు అంతస్థుల భవనాలను కూల్చివేస్తుండటంతో ఆ ఇళ్లలో నివసించి, ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన ఓటర్లకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో చేపట్టే చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందించలేకపోతున్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనూ 4 వేల మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం అందింది. రెసిడెన్షియల్ క్వార్టర్స్ వద్ద నివసించే సుమారు 50 వేల మంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

17న నామక్కల్‌లో అన్నాడీఎంకే ఆందోళన

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఈ నెల 17న నామక్కల్‌లోఅన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... నామక్కల్ జిల్లా రాశిపురంలోని తిరువళ్లూర్ కళాశాల ప్రాంగణంలో టైడల్ పార్క్ ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. టైడల్ పార్క్ ఏర్పాటుతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. అందువల్ల టైడల్ పార్క్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 17వ తేది ఉదయం 10 గంటలకు రాశిపురం ఆండకల్లూరు గేట్ ప్రాంతంలో ఆందోళన చేపట్టనున్నామన్నారు.

15న టీచర్ ఎంపిక పరీక్షలు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న టీచర్ ఎంపిక పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు 4.80 లక్షల మంది హాజరు కానున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు సహా 1608 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి ఈ పరీక్షలను రెండు రోజులపాటు జరుపనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 1 గంటకు ముగుస్తాయని, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9.30 గంటలకల్లా హాజరుకావాలని అధికారులు తెలిపారు.

మదురై, తిరువళ్లూర్‌లో ఏటీఎస్ కార్యాలయాలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ అనంతరం ఉగ్రవాద నిరోధక విభాగం (ఏటీఎస్) కార్యాలయాలకు మదురై, తిరువళ్లూర్‌లో స్థలాలు ఎంపిక చేశారు. పోలీసు ఇంటెలిజెన్స్ విభాగంలో గత ఏడాది ఏటీఎస్ పేరిట ఉగ్రవాద నిరోధక విభాగం చెన్నై ప్రధాన కేంద్రంగా ఏర్పాటైంది. డీఐజీ నేతృత్వంలో నలుగురు ఎస్పీలు, ఐదుగురు ఏడీఎస్పీలు సహా 300 మంది పోలీసులతో చెన్నై, మదురై, కోవైలో తాత్కాలిక భవనాల్లో ఈ విభాగం పనిచేస్తోంది. ఈ విభాగం పోలీసులు, 30 ఏళ్ల క్రితం కోవై బాంబు పేలుడు, హిందూ నేతలను హతమార్చిన కేసులో గాలిస్తున్న ఉగ్రవాదులు అబూబకర్, మహ్మద్ అలి, టైలర్ రాజా తదితరులను గత జూలైలో అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఏటీఎస్ విభాగానికి శాశ్వత కార్యాలయ నిర్మాణాలకు స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ఈ విషయమై ఏటీఎస్ అధికారులు మాట్లాడుతూ... ఉగ్రవాద నిరోధక విభాగం, కోవై రేస్ కోర్స్ ప్రాంతంలోని జిల్లా అటవీ శాఖ అధికారుల క్వార్టర్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ.6 కోట్లతో కొత్త భవనం నిర్మిస్తున్నామన్నారు. చెన్నైలో ఏటీఎస్ నమోదుచేసే కేసులు పూందమల్లిలోని ప్రత్యేక న్యాయస్థానంలో విచారిస్తున్నారు. చెన్నై నుంచి పూందమల్లిలోని న్యాయస్థానానికి ఉగ్రవాదులను తీసుకెళ్లే సమయంలో ట్రాఫిక్ రద్దీతో పాటు భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కారణంగా, తిరువళ్లూర్ జిల్లాలో ఏటీఎస్ కార్యాలయం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆ ప్రకారం, పూందమల్లి సమీపంలో చెంబరంబాక్కంలోను, మదురై అయన్‌పాపకుడి తదితర ప్రాంతాలు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.





వాల్వో మల్టీ యాక్సిల్ లగ్జరీ బస్సు - బస్సు లోపల సీటింగ్

దూర ప్రయాణం.. సుఖవంతం

● డిసెంబర్‌లోగా అందుబాటులోకి వాల్వో మల్టీ యాక్సిల్ లగ్జరీ బస్సులు

టి.నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ కొత్తగా కొనుగోలు చేసిన ఎనిమిది వాల్వో మల్టీ యాక్సిల్ లగ్జరీ బస్సులు నగరంలోని ఆ సంస్థ ప్రధాన డిపోకు తరలించారు. ఈ కొత్త రకం లగ్జరీ బస్సులను డిసెంబర్ లోగా నడిపేందుకు రవాణా సంస్థ అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ ఆమ్నీ బస్సులకు ధీటుగా లగ్జరీ బస్సులను నడిపేందుకు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ చర్యలు చేపట్టింది. ఆ మేరకు 130 బస్సులను కొనుగోలు చేసింది. ఈ బస్సుల బాడీ అందంగా తీర్చిదిద్దటం, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూర్చునేలా సీటింగ్ ఇతర సదుపాయాల ఏర్పాట్లన్నీ బెంగళూరులో జరుగుతున్నాయి. ఈ 130 బస్సుల్లో 110 బస్సులకు ఏసీ, స్లీపింగ్ సదుపాయం ఉండగా, మిగతా 20 బస్సులు వాల్వో మల్టీ యాక్సిల్ లగ్జరీ బస్సులు. ప్రస్తుతం ఈ వాల్వో లగ్జరీ బస్సుల్లో 8 బస్సులు రవాణాకు సిద్ధమయ్యాయి. బెంగళూరు నుండి ఆ బస్సులు మంగళవారం నగరానికి చేరుకున్నాయి. మిగతా 12 బస్సులు కూడా ఈ నెలాఖరులోగా చేరుకుంటాయని ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ అధికారులు తెలిపారు. ఈ బస్సులో 51 సెమీ స్లీపర్ సీట్లను ప్రయాణికులు నిద్రపోవడానికి వీలుగా ఏటవాలుగా సర్దుబాటు చేసుకునే సదుపాయం కూడా ఉంది. ప్రయాణికులు తమ లగేజీ భద్రపరచుకోవడానికి బస్సు దిగువ స్థలం కూడా ఉంది. అగ్ని ప్రమాదం సంభవిస్తే బస్సులోనే నీరు వచ్చేలా సన్నటి పైప్ లైన్లు కూడా ఉన్నాయి. ప్రతి సీటులోనూ మొబైల్ ఛార్జ్ చేసుకునే సదుపాయం, రీడింగ్ లైట్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ బస్సులను నగర శివారు ప్రాంతాల్లో ట్రయల్ రన్ నడిపేందుకు రవాణా సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు.

'క్యూ ఆర్' కోడ్ ద్వారా

ఆహార పదార్థాల నాణ్యతపై ఫిర్యాదు

● దక్షిణ రైల్వే పరిచయం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో 'క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆహార పదార్థాల నాణ్యతపై ఫిర్యాదు చేసే వసతి కల్పించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... కొత్త క్యూ ఆర్ కోడ్ సౌకర్యం ద్వారా రైల్వేస్టేషన్లలోని రెస్టారెంట్లు, దుకాణాల్లో అందించే ఆహార పదార్థాలు, తినుబండారాల నాణ్యతపై ఫిర్యాదు చేయవచ్చు. రెస్టారెంట్లలో అధిక ఛార్జీల వసూలు, నాణ్యత లేని ఆహారం, పరిమాణం, నీటి లభ్యత, పరిశుభ్రత తదితరాలపై ప్రయాణికులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. రెస్టారెంట్లు, దుకాణాల ముందున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే, రెస్టారెంట్ లొకేషన్, రైల్వే స్టేషన్ కోడ్ తదితర వివరాలు ఉంటాయి. అది వెంటనే 'రైల్ ధర్మ' అనే భారతీయ రైల్వే ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కార యాప్‌లోకి లాగిన్ చేస్తుంది. అందులో మీ మొబైల్ నెంబరు నమోదుచేసిన వెంటనే మీ సెల్‌ఫోన్‌కు 'ఓటీపీ' వస్తుంది. ఈ ఓటీపీ నమోదుచేసి, మీ ఫిర్యాదు నమోదుచేయవచ్చు. అనంతరం రిజిస్టర్డ్ మొబైల్ నెంబరుకు ప్రత్యేక రిఫరెన్స్‌తో కూడిన రసీదు మెసేజ్ రూపంలో పంపించనున్నారు. అనంతరం ఫిర్యాదులను విచారించి తగిన చర్యలు చేపడతామని దక్షిణ రైల్వే తెలిపింది.



దుకాణం ముందు ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్

విగ్రహాల స్మగ్లింగ్ కేసులో

ఐదేళ్లలో 220 మంది అరెస్టు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గత ఐదేళ్లలో ప్రాచీన విగ్రహాల చోరీలు, అక్రమ రవాణాలకు పాల్పడిన 220 మందిని అరెస్టు చేసినట్లు విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు తెలిపారు. అదే సమయంలో విదేశాలకు తరలించిన 444 ప్రాచీన విగ్రహాలను తిరిగి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో 123 కేసులు నమోదయ్యాయయని, 63 కేసులలో చోరీకి గురైన విగ్రహాల ఆచూకీ గుర్తించి, వాటిని తరలించిన వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం అడిషనల్ డీజీపీ కల్పనా నాయక్ తెలిపారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ మిద్దెపై నుంచి పడి ఒకరి మృతి

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన వ్యాసర్పాడి సమీపంలో చోటుచేసుకుంది. వ్యాసర్పాడి సామియార్ తోట్టం 4వ వీధికి చెందిన ముల్లైవేందన్-సత్యకళ దంపతులకు గణేష్ (21), సంతోష్ (18) అనే ఇద్దరు కుమారులున్నారు. సిమెంట్ కంపెనీలో పనిచేస్తున్న ముల్లైవేందన్ నాలుగు నెలలుగా పనికి వెళ్లడం లేదని తెలిసింది. బుధవారం రాత్రి ఇంటి రెండో అంతస్తుపై సెల్‌ఫోన్ మాట్లాడుతున్న ముల్లైవేందన్ సమయంలో, మిద్దె గోడ కూలి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయమైన ముల్లైవేందన్‌ను కుటుంబ సభ్యులు, స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందారు. ఈ ఘటనపై వ్యాసర్పాడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరునల్వేలిలో నయినార్ నివాసం వద్ద గుర్తు తెలియని వ్యక్తుల సంచారం

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా పాళయంకోట పెరుమాళ్ ప్రాంతంలో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ నివాసగృహం వద్ద బుధవారం అర్ధరాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదరీతిలో సంచరించారు. ఆ ఇద్దరు తలకు హెల్మెట్లు ధరించి నాగ్రేందన్ ఇంటివైపు తిరిగే రహదారి మలుపు వద్ద ఆగారు. వారి ప్రవర్తన వింతగా అనిపించడంతో స్థానికులు నయినార్ నాగేంద్రన్‌కు విషయం తెలిపారు. ఆలోగా ఈ సమాచారం పోలీసులకు కూడా చేరవేశారు. పోలీసులు అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించగా ఆ దుండగులు ఒకే బైకుపై అక్కడికి వెళ్ళి నాగేంద్రన్ ఇంటిని సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీస్తుండటం కనిపించింది. ఆ వీడియో ఆధారంగా దుండగులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వ్యాయామంతో మధుమేహం కట్టడి



కరపత్రాలను పంచుతున్న డీన్ రేవతి

తిరువళ్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం, సరైన ఆహార నియమాలతో మధుమేహాన్ని కట్టడి చేయవచ్చని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాల డీన్ రేవతి సూచించారు. అంతర్జాతీయ మధుమేహ దినాన్ని పురస్కరించుకొని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని వైద్యశాల డీన్ రేవతి ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధుమేహంపై ప్రజలకు మరింత అవగాహన అవసరమన్నారు. సమయపాలనతో కూడిన సరైన ఆహార నియమావళి, వ్యాయామంతో మధుమేహాన్ని అరికట్టవచ్చన్నారు. ఇందులో భాగంగా నర్సింగ్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభుశంకర్, మెడికల్ ఆఫీసర్ విజయరాజ్, చిన్నారుల విభాగం డాక్టర్ జగదీష్‌తో పాటు పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి హత్య కేసులో

ప్రియురాలి సహా ముగ్గురికి యావజ్జీవం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యంలో విషం కలిపి ఉపాధ్యాయుడిని హతమార్చిన కేసులో ప్రియురాలు సహా ముగ్గురికి కోర్టు యావజ్జీవ జైలుశిక్ష విధించింది. 2016 ఫిబ్రవరి 6వ తేదిన జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. తెన్‌కాశి సమీపం పుల్లుకాడు ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సంతోష్ (36) పావూరుసత్రం-సురండై రోడ్డులో తన భార్య అనూషతో నివసించేవాడు. సంతోష్ పక్కింట్లో మురుగన్-పొన్‌సెల్వి దంపతులు ఉండేవారు. మురుగన్ అబుదాబిలో ఉద్యోగం చేస్తుండడంతో, పొన్‌సెల్వి ఒంటరిగా ఇంట్లో ఉండేది. పొన్‌సెల్వి-అనూష మధ్య స్నేహం ఏర్పడింది. ఈ కారణంగా, తరచూ ఇంటికి వస్తున్న పొన్‌సెల్వితో సంతోష్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో, పొన్‌సెల్లి పావూరుసత్రం ఎంకేవీకేజీ రోడ్డులో కొత్తగా ఇల్లు నిర్మించుకుంది. ఈ క్రమంలో, పిల్లలను తల్లిదండ్రుల వదిలి తనతో జీవించాలని సంతోష్ పలుమార్లు పొన్‌సెల్విపై ఒత్తిడిచేశాడు. అదే సమయంలో, పొన్‌సెల్వి మరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్లు గుర్తించిన సంతోష్ ఆమెను మందలించడంతో ఇరువురి మధ్య విభేధాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో, మురుగన్ అబుదాబి నుంచి ఇంటికి వస్తున్నట్లు తెలుపడంతో, తమ విషయం బయట పడుతుందని భావించిన పొన్‌సెల్వి, సంతోష్‌ను హతమార్చాలని నిర్ణయించింది. అందుకు తన తమ్ముడు మురుగన్ (34), తండ్రి తంగపాండి (70)లకు తెలియజేసింది. వారు పథకం ప్రకారం, సంతోష్‌ను పొన్‌సెల్వి ఇంటికి పిలిచి మద్యంలో విషం కలిపి ఇచ్చి హతమార్చారు. మృతదేహాన్ని ఇంటి వెనుక గుంతతీసి అందులో పూడ్చిపెట్టారు. తన భర్త కనిపించడం లేదంటూ అనూష ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి చేపట్టిన విచారణలో... పొన్‌సెల్వి మద్యంలో విషం కలిపి సంతోష్‌ను హతమార్చినట్లు తెలియడంతో, పొన్‌సెల్వి, మురుగన్, తంగపాండిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తెన్‌కాశి అదనపు జిల్లా న్యాయస్థానంలో విచారణ ముగిసిన నేపథ్యంలో, న్యాయమూర్తి మనోజ్‌కుమార్, పొన్‌సెల్వి సహా ముగ్గురికి యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

పెట్రోల్ బంక్‌లో సిబ్బందిపై దాడి

● యువకుడి అరెస్ట్



నిర్మల్‌కుమార్

తిరుత్తణి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని ఓ పెట్రోల్ బంక్‌లో బుధవారం ఉదయం పెట్రోల్ పోయించుకోడానికి వచ్చిన నిర్మల్ కుమార్ (28)అనే యువకుడు డబ్బులివ్వకుండా వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది అతడిని అడ్డుకునే సరికి దాడిచేసి పోలీసులకు చెబితే హతమారుస్తానని బెదిరించి పరారైయ్యాడు. దీనిపై అందిన సమాచారంతో రంగంలోకి దిగిన తిరుత్తణి పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా 24గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణలో అతడిపై ఇంతకు ముందే పలు కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

24న ఓపీఎస్ నేతృత్వంలో హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం ఈనెల 24వ తేది జరుగుతుందని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... వెప్పేరి రిథర్డన్ రోడ్డులోని వైఎంసీఏ కల్యాణ మండపంలో సమావేశం జరుగుతుందన్నారు. రాజకీయ సలహాదారు బన్నూర్ ఎస్.రామచంద్రన్ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి అందరూ తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు. శాసనసభ ఎన్నికల్లో పోటీ, కూటమిలో చేరడం సహా పలు అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఓపీఎస్ తెలిపారు.

'గూగుల్'కు ఇచ్చిన స్థలం 'ఫాక్స్‌కాన్'కు కేటాయింపు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గైడెన్స్ ఇన్‌స్టిట్యూట్ కార్యాలయంలో గూగుల్‌కు అద్దెకు ఇచ్చిన స్థలాన్ని ఫాక్స్‌కాన్‌కు కేటాయించనున్నారు. అమెరికాలోని పారిశ్రామిక సంస్థల నుంచి పెట్టుబడులు ఆకర్షించడానికి ముఖ్యమంత్రి స్టాలిన్, పరిశ్రమల శాఖ మంత్రి రాజాలతో కూడిన అధికారుల బృందం గత సెప్టెంబరులో అమెరికాలో పర్యటించింది. ఆ సమయంలో, తమిళనాడు ప్రభుత్వ గైడెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఏఐ టెక్నాలజీ ప్రయోగశాలను ఏర్పాటుచేయడానికి గూగుల్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ పనులు కొనసాగించేలా తేనాంపేటోని ఓ ప్రైవేటు క్యాంప్‌లో 11వ అంతస్తులోని గైడెన్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన కార్యాలయంలో అదనంగా 500-600 చ.అ స్థలం అద్దెకు తీసుకుని గూగుల్‌కు కేటాయించారు. అధికారులతో చర్చలు జరిపినప్పటికీ, గూగుల్ ఇంకా ల్యాబ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించలేదు. గూగుల్ ఇంకా కార్యాలయం ప్రారంభించప్పటికీ, అద్దె మాత్రం చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో, తైవాన్ కంపెనీ ఫాక్స్‌కాన్ ఆపిల్ ఫోన్ల విడిభాగాల అసెంబుల్డ్ కర్మాగారం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ కారణంగా గూగుల్‌కు అద్దెకు ఇచ్చిన అదనపు స్థలాన్ని ఫాక్స్‌కాన్ సంస్థకు కేటాయించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో ఆక్రమణల తొలగింపు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలోని దుకాణాలు అధికారులు పోలీసుల సాయంతో తొలగిస్తున్నారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయం వెనుక వైపున్న కొండ చుట్టూ పౌర్ణమి రోజుల్లో లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. ఈ క్రమంలో అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాలు ఈ నెల 21న ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో భాగంగా డిసెంబరు 3వ తేది ఆలయంలో భరణి దీపం, కొండ శిఖరంపై మహా దీపం వెలిగించనున్నారు. ఈ వేడుకలకు సుమారు 40 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా అధికారులు, ఆలయ నిర్వాహకులు సంయుక్తంగా వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. అందులో భాగంగా గిరి ప్రదక్షిణ మార్గంలోని అక్రమ దుకాణాలను తిరువణ్ణామలై తాలూకా ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ నేతృత్వంలో పోలీసులు తొలగించారు. కార్తీక దీపోత్సవాలు ముగిసే వరకు గిరి ప్రదక్షిణ మార్గంలో ఆక్రమణ దుకాణాలు ఏర్పాటు చేయవద్దని వ్యాపారులను పోలీసులు హెచ్చరించారు.



ఆక్రమణలు తొలగింపులో పోలీసులు

అసెంబ్లీ ఎన్నికల్లో మెగా కూటమి ఏర్పాటు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



జిల్లా నేతల సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమలత

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మెగా కూటమి ఏర్పాటు చేస్తానని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటించారు. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం జరిగిన జిల్లా నేతల సమావేశంలో ఆమె ప్రసంగించారు. అన్ని పార్టీలకంటే ముందుగా తమ పార్టీ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించిందని, తన పర్యటనకు లక్షలాదిమంది ప్రజలు హాజరవుతుండటంతో ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామనే నమ్మకం కలుగుతోందన్నారు. రాష్ట్రం లో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల తర్వాత బలమైన మూడో పార్టీగా డీఎండీకే ఉందని, ఏయే పార్టీలను కలుపుకుని కూటమి ఏర్పాటు చేయాలనే విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. డిసెంబర్ 28న కెప్టెన్ ద్వితీయ గురుపూజ నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో 84మంది జిల్లా శాఖ కార్యదర్శులకుగాను 74 మంది హాజరయ్యారు. డీఎండీకే ప్రిసీడియం చైర్మన్ డాక్టర్ ఇలంగోవన్, కోశాధికారి ఎల్కే సుదీష్, ప్రధాన కార్యాలయం కార్యదర్శి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

● కరూర్ ఘటన వ్యవహారం..

మూడో రోజూ క్షతగాత్రుల విచారణ

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరూర్ ఘటనలో గాయపడిన వారిని మూడో రోజైన గురువారం కూడా సీబీఐ అధికారులు విచారించారు. కరూర్ వేలుచామిపురంలో సెప్టెంబరు 27వ తేది తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట సంభవించిన 41 మంది మృతిచెందగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు ఉత్తర్వులతో సీబీఐ అధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో, ఈ ఘటనలో గాయపడిన వారికి సీబీఐ అధికారులు సమన్లు జారీచేశారు. మంగళవారం 20 మంది, బుధవారం ఆరుగురు విచారణకు హాజరయ్యారు. గురువారం విచారణకు గాయపడిన ఐదుగురు హాజరుకాగా, వారి సమాధానాలను అధికారులు వాంగ్మూలంగా నమోదుచేశారు.

డీజీపీ మెమో ఇచ్చినా విధుల్లోనే 84 మంది పోలీసులు

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ మెమో జారీచేసినప్పటికీ నగరంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీ కింద నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాల్లో సుమారు 84 మంది పోలీసులు నిబంధనలు అతిక్రమించి పనిచేస్తున్నట్లు తెలిసింది. సహజంగా పోలీసు ట్రైనింగ్ కాలేజీ నిర్ణయించిన నిబంధనల ప్రకారం శిక్షణ పాఠశాలల్లో పనిచేస్తున్న పోలీసులు మూడేళ్ల తర్వాత వెంటనే ఇతర విభాగాలకు బదిలీ అవ్వాలి. అయితే సుమారు 84 మంది పోలీసులు 7 నుండి 14యేళ్ల వరకు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న విషయం తెలిసి వారిని బదిలీ కావాలంటూ డీజీపీ మెమో ఇచ్చారు. చివరగా సెప్టెంబరు నెలాఖరులో శాంతి భద్రతల డీజీపీ వెంకటరామన్ ఈ వ్యవహారంపై పోలీస్ ట్రైనింగ్ కాలేజీ అధికారి సంజీవ్‌రాయ్ రాథోడ్‌కు లేఖరాశారు. నెల రోజుల్లోపు నిబంధనలు అతిక్రమించిన పోలీసుల వద్ద విచారణ జరిపి నివేదిక దాఖలు చేయాల్సిందిగా లేఖలో సూచించారు.

ఆమ్నీ బస్సు యజమానులకు న్యాయం చేయాలి

● ప్రభుత్వానికి అన్నామలై డిమాండ్

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వారం రోజుల క్రితం తమిళనాడు రిజిస్ట్రేషన్ నెంబరుతో నడిపిన సుమారు వంద బస్సులను స్వాధీనం చేసుకుని రూ.2కోట్ల మేర జరినామా విధించిన కారణంగా నష్టపోయిన రాష్ట్ర ఆమ్నీ బస్సుల యజమానులకు న్యాయం చేయాలని రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. ఆయన గురువారం తన ఎక్స్‌పేజీలో విడుదల చేసిన వివరాలిలా ఉన్నాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ రాష్ట్రాలకు చెందిన ఆమ్నీ బస్సుల యజమానులకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని, అయితే బస్సులు నడపడం వల్ల నష్టపోతున్న రాష్ట్ర ఆమ్నీ బస్సు యజమానుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నామలై డిమాండ్ చేశారు.

పురుషులకు నెలకు రూ.1,000

● వదంతులు నమ్మొద్దన్న ప్రభుత్వం

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ప్రోత్సాహక నిధి కింద నెలకు రూ.1,000 అందిస్తున్న విషయం తెలిసిందే. అలాగే, పురుషులకు కూడా నెలకు రూ.1,000 అందజేసే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనుందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఒక స్పష్టత అందజేసింది. ఈ మేరకు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... ఇది తప్పుడు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం 'తమిళ్ పుదల్వన్' పథకం కింద నెలకు రూ.1,000 పొందాలంటే, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో (తమిళ మాధ్యమంలో) 6వ తరగతి నుంచి ప్లస్ టూ చదివినవారై ఉండాలి. ఆ విద్యార్థులు డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ కోర్సుల్లో చేరితే మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం తరఫున వారి బ్యాంక్ ఖాతాల్లో రూ.1,000 జమచేస్తున్నారు. పురుషులందరికి రూ.1,000 అందించనున్నారనే వార్తలు పూర్తిగా అవాస్తవం. అలాంటి పుకార్లు నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

వారాంతపు సెలవులకు 920 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా సొంతూళ్లు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సౌకర్యార్థం శుక్ర, శనివారాల్లో 920 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 340 బస్సులు, శనివారం 350 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాదవరం బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాలు తలా 20 బస్సులు నడుపనున్నారు. ఇక, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాల నుంచి పలు ప్రాంతాలకు వంద ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. సెలవులు ముగించుకుని బయల్దేరే ప్రయాణికుల సౌకర్యార్థం పలు నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు



ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి హుండీ ఆదాయం రూ.4.26కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆలయ ప్రాంగణం, లోపల ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించే కానుకలను నెలకోసారి లెక్కిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల హుండీ ఆదాయం లెక్కింప గురువారం హిందూ దేవాదాయశాఖ కమిషనర్ రాము అధ్యక్షతన జరిగింది. ఇందులో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.4కోట్లు, 26లక్షల, 22వేల 507 నగదు, 1.275 కిలోల బంగారం, 30.857 కిలోల వెండి, 1,421 విదేశీ కరెన్సీని భక్తులు హుండీలో వేశారు. ఓ భక్తుడు సుబ్రమణ్యస్వామి, వినాయకుడు, వల్లీ, దేవసేన అమ్మవార్ల చిత్రాలతో కూడిన 54 వెండి నాణాలతో తయారుచేసిన దండను కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



లిజోమోల్ జోస్

విజయ్ సేతుపతి సరసన 'జైభీమ్' హీరోయిన్

ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' హీరోయిన్ లిజోమోల్ జోస్ నటించనున్నారు. బాలాజీ ధరణీధరన్ దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే చెన్నైలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్‌గా మలయాళ భామ లిజోమోల్‌ను ఎంపిక చేశారు. ప్రముఖ దర్శకుడు అట్లీ తన సొంత నిర్మాణ సంస్థపై తెరకెక్కిస్తున్నారు. 'నడువుల కొంజెం పక్కత్త కాణోం', 'సీతక్కాది' వంటి చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి - దర్శకుడు బాలాజీ కాంబోలో రానున్న మూడో చిత్రం. టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ చిత్రాన్ని పూర్తి చేసిన తర్వాత విజయ్ సేతుపతి ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోనున్నారు. ఈ మూవీకి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెల్లడికానుంది.

హర్రర్ కామెడీ మూవీగా 'రజినీ గ్యాంగ్'

● ఆడియో రిలీజ్



రజినీ కిషన్, దివిక తదితరులు

మిశ్రీ ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై ఎస్.చైన్‌రాజ్ జైన్ ఆశీస్సులతో రజినీ కిషన్ హీరోగా ఎం.రమేష్ భారతి దర్శకత్వంలో హర్రర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'రజినీ గ్యాంగ్'. దివిక హీరోయిన్. మొట్టై రాజేంద్రన్, కూల్ సురేష్, మునీష్ కాంత్ తదితరులు నటించారు. త్వరలోనే విడుదలకానున్న ఈ చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. ప్రముఖ దర్శక నటుడు చేరన్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఆడియో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో చిత్ర దర్శకుడు రమేష్ భారతి మాట్లాడుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఇందులో ఎమోషన్, హర్రర్, కామెడీ ఇలా అన్ని అంశాలు ఉన్నాయి. సంగీత దర్శకుడు జోన్స్ మంచి సంగీతాన్ని అందించారు. ఊరి నుంచి పారిపోయే ప్రేమ జంట వివాహం చేసుకుంటుంది. కానీ, ఇక్కడ వారికి అనేక సమస్యలు ఎదురవుతాయి. ఆ తర్వాత జరిగే సంఘటనలకు ఎమోషన్, కామెడీ, హర్రర్ జోడించి తెరకెక్కించాం' అని పేర్కొన్నారు. హీరో రజినీ కిషన్ మాట్లాడుతూ, 'నేను నటించిన మూడో చిత్రం. ప్రేక్షకుల హృదయాల్లో గొప్ప హీరోగా స్థానం సంపాదించుకోవాలన్నదే నా కల. ఈ సినిమాలో నటించిన పెద్ద నటీనటులు ఎంతగానో సహకరించారు. హీరోయిన్ దివికా మాట్లాడుతూ, 'భాషా సరిహద్దులు పట్టించుకోకుండా నా ప్రతిభను గుర్తించి సినిమాల్లో అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. హీరో రజినీ కిషన్ ఎంతగానో సహకరించారు. మా ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ ఉంది' అని వివరించారు.

సత్యసాయి ఆదేశానుసారమే 'అనంత'

● దర్శకుడు సురేష్ కృష్ణ



'అనంత' టీజర్ రిలీజ్ దృశ్యం

పుట్టపర్తి సత్యసాయిబాబా ఆదేశానుసారంతో ఆయన లీలలు, మహిమలు ఆధారంగా 'అనంత' పేరుతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు దర్శకుడు సురేష్ కృష్ణ తెలిపారు. ఇందులో జగపతిబాబు, సుహాసిని, తలైవాసల్ విజయ్, వైజీ మహేంద్రన్, అభిరామి తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 'ఇసైతెంద్రల్ దేవా సంగీతం. పుట్టపర్తి సత్యసాయి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. పుట్టపర్తి సాయిబాబా జాతీయ ట్రస్ట్ నిర్వాహకులు రత్నాకర్ ఈ టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సురేష్ కృష్ణ మాట్లాడుతూ, 'సత్య సాయి బాబా మహిమలు, లీలలను వివరించేలా చిత్రాన్ని రూపొందించాలని భావించాను. 2009లో ఒక ఆధ్యాత్మిక చిత్రం నిర్మించే అవకాశం వచ్చింది. కానీ, పుట్టపర్తి సత్యసాయి బాబా జీవిత చరిత్రను తెరకెక్కించాలని ఒక వ్యక్తి చెప్పారు. అపుడే పుట్టపర్తి వెళ్ళి బాబా సమాధి సమీపంలో కూర్చొన్నాను. అపుడు ఇన్నేళ్ళు ఎక్కడ ఉన్నావు? ఇపుడు వచ్చావు అంటూ తెలుగులో బాబా మాటలు వినిపించాయి. గత యేడాది ఓ రోజు తెల్లవారుజామున బాబా కలలో వచ్చి విబూది ఇచ్చారు. నా దర్శకత్వంలో సాయి బాబా చిత్రాన్ని రూపొందించాలని రత్నాకర్‌తో చర్చించాను. ఆ తర్వాత నిర్మాత గిరీష్. తనకు కూడా కలలో సాయిబాబా చిత్రాన్ని చేయాలన్న ఆదేశం వచ్చిందని చెప్పారు. అలా ఈ చిత్రం కార్యరూపం దాల్చింది. చిత్రీకరణ సమయంలోనూ అనేక ఆశ్చర్యకర సంఘటనలు జరిగాయి. సత్యసాయి బాబా పాత్రధారిగా ఎవరూ నటించలేదు. బాబా రియల్ వీడియో ఉపయోగించాం. ఈ చిత్రంలోని పాటలను కూడా 'నేను కంపోజ్ చేయలేదు.. ఆ బాబానే కంపోజ్ చేసినట్టు దేవా చెప్పారు. ఇలాంటి అనేక అద్భుతాలు ఇందులో జరిగాయి. ఇది బాబా భక్తులకు, ప్రేక్షకులకు ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక, భక్తిరస చిత్రంగా ఉంటుంది' అన్నారు.

చిత్రజ్యోతి

24 నుంచి 'అరసన్' రెగ్యులర్ షూటింగ్



జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ శింబు అలియాస్ సిలంబరసన్ టీఆర్ నటించే 'అరసన్' చిత్రం షూటింగ్ ఈ నెల 24 నుంచి ప్రారంభంకానుంది. ఇందుకోసం ఉత్తర చెన్నై తరహాలో ప్రత్యేకంగా ఒక సెట్ నిర్మించారు. ఇందులో తొలి షెడ్యూల్ చిత్రీకరించనున్నారు. వి క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత థాను నిర్మించే ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్. ఈ ప్రాజెక్టు కోసం అనిరుధ్ - వెట్రిమారన్‌లు కలిసి పనిచేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ప్రోమోకు సోషల్ మీడియాలో మంచి స్పందన వచ్చిన విషయం తెల్సిందే. ఈ మూవీ కథ, పాత్రల తీరు తెన్ను 'వడ చెన్నై' మూవీ తరహాలో ఉంటాయని దర్శకుడు వెల్లడించడంతో ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

→ వెట్రిమారన్, శింబు



ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల 90వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఆళ్వార్‌పేటలోని నివాసంలో ఆమెను కలిసి బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతున్న సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ దంపతులు

తాత్కాలికంగా పళనిలో రోప్‌కార్ సేవల నిలిపివేత

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళనిలో కొండపై ఉన్న దండాయుధపాణి ఆలయానికి నడుపుతున్న రోప్‌కార్ సేవలను మరమ్మతుల కారణంగా గురు, శుక్రవారాల్లో నిలిపివేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పళని దండాయుధపాణి స్వామివారి దర్శనం కోసం రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే కాకుండా విదేశాలు, పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు ప్రతిరోజు పెద్దసంఖ్యలో వస్తుంటారు. కింద నుండి కొండపైకి వెళ్లేందుకు మెట్లదారి అందుబాటులో ఉన్నప్పటికీ ఆలయ యాజమాన్యం రోప్ కార్, వించ్‌రైలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇదిలా వుండగా, భక్తుల భద్రత దృష్ట్యా రోప్‌కార్ కేంద్రంలో నెలవారీ మరమ్మతులు గురువారం చేపట్టారు. ఇందువల్ల శుక్రవారం వరకు రోప్‌కార్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. భక్తులు వించ్‌రైలు, మెట్లదారి గుండా కొండపైనున్న ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.



పళని కొండపైకి వెళ్లే రోప్‌కార్

27 నుంచి కార్తిక దీపోత్సవం...

రాష్ట్రంలో సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన ఆరు ప్రధాన శైవక్షేత్రాల్లో మూడవదైన పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ సాయారక్ష పూజతో కార్తిక దీపోత్సవం ప్రారంభమవుతుంది. డిసెంబరు 2న కొండపై భరణి దీపం వెలిగిస్తారు. 3వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు విశ్వరూప దర్శనం, విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు సాయారక్ష పూజ, 4.45 గంటలకు బంగారు నెమలి వాహనంలో స్వామివారి ఊరేగింపు, 6గంటలకు కొండపై నాలుగు వైపులా కార్తిక దీపోత్సవం జరుగుతుంది. అదేవిధంగా ఈ ఆలయ నిర్వహణలో ఉన్న ఆవినకుడి, పెరియనాయగి అమ్మవారి ఆలయం, పూంబారై మురుగన్ ఆలయాల్లో కూడా కార్తిక దీపోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

'రాజస్థానీ-తమిళ సేవా అవార్డ్స్ 2026'కు దరఖాస్తుల ఆహ్వానం



దరఖాస్తు స్వీకరణ వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజస్థానీ అసోసియేషన్ తమిళనాడు రెండో ఏడాది కూడా 'రాజస్థానీ-తమిళ సేవా అవార్డ్స్ 2026' పేరుతో పురస్కారాలు ప్రదానం చేయనుంది. ఈ మేరకు నగరంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాజస్థానీ అసోసియేషన్ తమిళనాడు ప్రెసిడెంట్, రాజస్థానీ-తమిళ సేవా అవార్డ్స్ 2026 కన్వీనర్ సీఏ అనీల్ కిచా సంయుక్తంగా మాట్లాడుతూ.. పలు రంగాల్లో రాణిస్తున్న వారికి ప్రోత్సహించేలా రెండో ఏడాది కూడా ఈ అవార్డులు ప్రదానం చేయనున్నామన్నారు. వ్యక్తిగతంగా, సంస్థ పరంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయం-గ్రామీణాభివృద్ధి, కళలు-సాహిత్యం, వైద్యం-విద్య, పర్యావరణం, సామాజిక కార్యక్రమాలు సహా పలు రంగాల్లో సేవ చేస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేయనున్నామని తెలిపారు. అవార్డు కింద రూ.2 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేయనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు www.rajasthanitamil.org అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 5వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు పరిశీలించిన అవార్డుల కమిటీ విజేతలకు ఎంపిక చేస్తుందని, విజేతలకు 2026 ఫిబ్రవరి 1వ తేది పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

ఊటీలో రూ.2 కోట్లతో 'సైన్స్ పార్క్'



పార్క్‌లో ఏర్పాటవుతున్న రాకెట్ నమూనాలు

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఊటీ సెంట్రల్ బస్టాండ్ సమీపంలో రూ.2 కోట్లతో 'సైన్స్ పార్క్' నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నీలగిరి జిల్లా ఊటీలో పలు ప్రాంతాల్లో పార్కులున్నాయి. బొటానికల్ గార్డెన్, రోజా పార్క్, ఆర్బొటేరియం పార్క్ తదితరాలు ఉద్యానవన శాఖ ఆధ్వరంలో ఉండగా, ఆ పార్క్‌లను ప్రతిరోజు పెద్దసంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు.అలాగే, ఊటీ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు చిన్న పార్క్‌లుండగా, ఈ పార్క్‌లకు పర్యాటకులు తక్కువ సంఖ్యలో వస్తుండగా, స్థానికులు మాత్రం వాకింగ్ తదితరాలకు వినియోగించుకుంటున్నారు. ఈ పార్క్‌లను కూడా అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా మున్సిపాలిటీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, ఊటీ సెంట్రల్ బస్టాండ్ సమీపంలో రూ.2 కోట్లతో సైన్స్ పార్క్ ఏర్పాచేయనుంది. ఇస్రో ప్రయోగించిన రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలు, సైన్స్‌కు సంబంధించి పలు ప్రాజెక్టులు ఈ పార్క్‌లో ఏర్పాటుకానున్నాయి. ఈ పార్క్ పాఠశాల, కళాశాలల విద్యార్థులు, పర్యాటకులను ఆకర్షించేలా రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.32 కోట్లు



హుండీ లెక్కింపు ద్వారా వచ్చిన కరెన్సీ కట్టలు

తిరుత్తణి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారి హుండీ ఆదాయం రూ.1.32కోట్లు వచ్చినట్టు అధికారుల తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు సమర్పించే నగదును నెలకోసారి లెక్కిస్తుంటారు. ఈ నేపథ్యంలో, హిందూ దేవాదాయశాఖ అనుమతించడంతో 27 రోజులు హుండీలో భక్తులు వేసిన కానుకల లెక్కింపు ఆలయ వసంత మండపంలో గురువారం ఆలయ కమిషనర్ రమణి అధ్యక్షతన జరిగింది.ఇందులో భక్తులు నగదు రూపంలో రూ.1,32,33,116కోట్ల నగదు, 713గ్రాముల బంగారం, 8,459 గ్రాముల వెండి కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సీఎం ట్రోఫీ బాక్సింగ్ ఛాంపియన్‌గా ఏఎం జైన్ కాలేజ్



స్వర్ణపతకం స్వీకరిస్తున్న ఎస్.దీప

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన బాక్సింగ్ సీఎం ట్రోఫీ రాష్ట్ర ఛాంపియన్‌గా ఏఎం జైన్ కాలేజీ విద్యార్థినుల బృందం నిలిచింది. కాలేజీకి చెందిన ఎస్.దీప, పి.అనిత స్వర్ణ పతకాలు, ఎం.శ్వేత, ఆర్.సంగీత సిల్వర్ పతకాలు, ఎంజీవా, ఎస్.శరణ్య రజత పతకాలు సాధించారు. దీని గురించి కాలేజీ అసోసియేట్ సెక్రటరీ మాట్లాడుతూ.. తమ మహిళా బాక్సర్లు మరోసారి సాధికారత, సంకల్పం, శ్రేష్ఠతకు నిజమైన స్ఫూర్తి ప్రదర్శించారని కొనియాడారు. తమ కళాశాలలో క్రీడలను కూడా ప్రోత్సహిస్తున్నామని, వారి విజయం తమ యాజమాన్యం అందించే నిరంతర మద్దతుకు ప్రతిబింబమని పేర్కొన్నారు.



విజేతలతో డాక్టర్ బాబు మనోహరన్ తదితరులు

బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా సెయింట్ జోసఫ్ మహిళా జట్టు

ప్యారీస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియమెట్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో సెయింట్ జోసఫ్ కళాశాల మహిళా జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. నగరంలోని యతిరాజ్ కళాశాల, ఎంవోపీ వైష్ణవ్ కళాశాల సహా పలు కళాశాలల మహిళా జట్లు ప్రీమియర్ లీగ్ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నారు. ఫైనల్స్‌లో యతిరాజ్ కళాశాల టీంను మట్టికరిపించిన సెయింట్ జోసఫ్ కాలేజీ మహిళా జట్టు ట్రోఫీని గెలుచుకుంది. ఉత్తమ క్రీడాకారిణిగా ఫైనల్ ఇయర్ విద్యార్థిని పి.కల్పిత ఎంపికయ్యారు. గురువారం ఈ జట్టును సంస్థ చైర్మన్ డాక్టర్ బాబు మనోహరన్, మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్, కోచ్‌లు అభినందించారు.

అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో 'హ్యాపీ హార్ట్స్' ప్రారంభం



అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో 'హ్యాపీ హార్ట్స్' సందర్భంగా సందడి చేస్తున్న బడిపిల్లలతో ఆస్పత్రి నిర్వాహకులు, అతిథులు తదితరులు

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా అపోలో చిల్డ్రన్స్ హాస్పిటల్, అపోలో షైన్ ఫౌండేషన్ సహకారంతో 'హ్యాపీ హార్ట్స్' పేరిట వినూత్నమైన కార్యక్రమం ప్రారంభమైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పాఠశాల విద్యార్థులు పరామర్శించి, వారిని సంతోషపెట్టడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని అపోలో షైన్ ఫౌండేషన్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఇందిరా జయకుమార్ అన్నారు. చికిత్స పొందుతున్న చిన్నారులకు స్కూలు పిల్లలు శుభాకాంక్షలు రాయడానికి 'విష్ వాల్' కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం థౌజెండ్‌లైట్స్‌లోని అపోలో హాస్పిటల్ సమీపంలోని చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో అపోలో హాస్పిటల్స్ చెన్నై రీజిన్ సీఈఓ డాక్టర్ ఇలంకుమరన్ కళియమూర్తి, కరడి టేల్స్ వ్యవస్థాపకురాలు శోభా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీవీఎస్, ఐసీపీఈ మెగా ఎడిషన్ ప్రారంభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్తలు

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ పంప్స్, వాల్వ్స్ సిస్టమ్స్ (ఐపీవీఎల్) - ఇండస్ట్రియల్ కెమికల్ ప్రాసెస్ ఎక్విప్‌మెంట్ (ఐసీపీఈ) ఆధ్వర్యంలో నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో గురువారం ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. ఈ నెల 15వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఈ ప్రారంభోత్సవంలో గ్రండ్ ఫోస్, రుహ్‌పం పెన్ ఇండియా, ఎల్ అండ్ టి వాల్వ్స్, టెహ్రీ వాల్వ్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కేఎస్‌బీ లిమిటెడ్, కిరోన్ హైడ్రాలిక్ నీడ్స్, థర్మాక్స్ , ఆండ్రెట్జ్ టెక్నాలజిస్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్బిట్ ఎగ్జిబిషన్స్ ఎండీ రూపేస్ వికామ్సే మాట్లాడుతూ.. ఐపీవీఎస్‌ను ఐసీపీఈతో కలపడం ద్వారా తాము ప్రదర్శనకారులకు, సందర్శకులకు మెరుగైన విలువలను అందించే ఏకీకృత వేదిక అందించామని వివరించారు.

పిల్లల కంటి చూపుపై శ్రద్ధ వహించాలి

● రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్ కృష్ణ



'ఆర్వోపీ' చికిత్స జరిగిన చిన్నారులు, తల్లిదండ్రులతో డాక్టర్ ప్రవీణ కృష్ణ, కర్ణాటక సంగీత విద్వాంసురాలు రంజని

పెరంబూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లల కంటి చూపుపై శ్రద్ధ వహించాలని రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ కృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. శ్రీకృష్ణ గానసభలో ఈ నెల 16వ తేది సాయంత్రం 6 గంటలకు రాధాత్రి నేత్రాలయ ఆధ్వర్యంలో 'నేత్రా 25' పేరుతో కర్ణాటక సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఇందులో 'ది రాగ సిస్టర్స్'గా పేరుగాంచిన రంజని, గాయత్రి పాల్గొననున్నారు. రాగ సిస్టర్స్‌లో ఒకరైన రంజని గురువారం రాధాత్రి నేత్రాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా డా.ప్రవీణ కృష్ణ మాట్లాడుతూ... తమ ఆస్పత్రి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 'రెటీనోపతి ఆఫ్ ప్రెమెచ్యూరిటీ (ఆర్‌ఓపీ) సమస్యతో బాధపడే పసికందులకు చికిత్స అందిస్తున్నామన్నారు. పుట్టిన బిడ్డలో ఆర్‌ఓపీ కారణంగా పుట్టుకతోనే కంటి చూపు కోల్పోయే ప్రమాదముందన్నారు. తమ ఆస్పత్రిలో పసికందుల్లో ఆర్‌ఓపీ సమస్య గుర్తించి సత్వరం చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఆ ప్రకారం, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్‌లో 1.50 లక్షల మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 5,000 మంది ఆర్‌ఓపీతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. వారికి తమ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు డా.ప్రవీణ కృష్ణ తెలిపారు. ఈ పర్యటన భాగంగా రాధాత్రి నేత్రాలయ సామాజిక సేవలను సంగీత గాయని రంజని ప్రశంసించారు.

మందవెలి - ఈస్ట్ రింగ్ రోడ్డు రహదారికి తన తండ్రి దివంగత సంగీత దిగ్గజం సీర్గాళి గోవిందరాజన్ పేరు పెడతామని ప్రకటించినందుకు సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలుపుకుంటున్న ప్రముఖ గాయకుడు డాక్టర్ సీర్గాళి శివ చిదంబరం తదితరులు



రోబోటిక్ సర్జరీలో గ్లెనీగల్స్ హాస్పిటల్ మైలురాయి



కోలుకున్న రోగిని అభినందిస్తున్న వైద్యులు

అడయార్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన గ్లెనీగల్స్ హాస్పిటల్స్ రోబోటిక్ సర్జరీలో చారిత్రాత్మకమైన మైలురాయి సాధించింది. రోబోటిక్ హిస్టెరెక్టమీ ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఫైబ్రాయిడ్ గర్భాశయాన్ని విజయవంతంగా తొలగించినట్టు హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, హాస్పిటల్ హెడ్ నిరంజని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరానికి చెందిన 47 యేళ్ళ ఉపాధ్యాయురాలి గర్భాశయంలో 36 వారాల పిండంతో సమానమైన 4.95 కిలోగ్రాముల బరువుండే ఫైబ్రాయిడ్‌ను గైనకాలజీ, రోబోటిక్ సర్జన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ పద్మప్రియ వివేక్ నేతృత్వంలో వైద్య బృందం 'కట్టింగ్ ఎడ్జ్ డా విన్సి లెవన్ సర్జికల్ సిస్టమ్' ద్వారా తొలగించినట్టు ఆమె వెల్లడించారు. ఇదే విషయంపై సీఈవో నిరంజని మాట్లాడుతూ, డాక్టర్ పద్మప్రియ నేతృత్వంలోని వైద్య బృందం ఈ అరుదైన మైలురాయి సాధించడం పట్ల ఎంతో గర్విస్తున్నట్టు చెప్పారు. తమ ఆస్పత్రి ప్రపంచ స్థాయి వైద్య సంరక్షణ అందించడంలో ఎల్లవేళలా ముందుంటుందన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్

తిరువళ్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కలెక్టరేట్‌లో పిల్లల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రతాప్ ప్రారంభించారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. అనంతరం కాఫీ విత్ కలెక్టర్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న వసతి, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ప్రతిభకనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిశు సంరక్షణ శాఖ అధికారులు నిశాంతిని, సుధ, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ తేన్‌పాండియన్, పిల్లల సంరక్షకులు పాల్గొన్నారు.

→ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రతాప్





అంతా మీ చేతిలోనే ఉంది

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం ● జాగ్రత్తలే శ్రీరామరక్ష

మధుమేహం అంటే..

మన రక్తంలో గ్లూకోజ్(చక్కెర) స్థాయి ఎక్కువగా ఉండే స్థితిని మధుమేహం (డయాబెటిక్) అంటారు. ఇన్సులిన్ అనే హార్మోన్ తగినంతగా శరీరంలో ఉత్పత్తి కాకపోవడం, కణాలు దానికి సరిగ్గా స్పందించక పోవడం వలన గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహంగా మారుతుంది.

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధుమేహం(డయాబెటిక్) జీవితకాల సమస్యే కానీ, తగిన జాగ్రత్తలో నియంత్రించుకుంటే ఆరోగ్యానికి ముప్పు ఉండదు. తీసుకునే ఆహారం, శారీరక వ్యాయామం ఇవి రెండూ నియంత్రణలో కీలకం. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రజల్లో మధుమేహం పెరుగుతోంది. మధుమేహం వ్యాప్తిస్తున్న దేశాల్లో మన దేశం మొదటి స్థానంలో ఉంటే, దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మన జిల్లా నాలుగో స్థానంలో ఉంది. తిరుపతి జిల్లాలో 1,22,245 మంది మధుమేహంతో బాధపడుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఇది టెస్ట్ చేసుకుని మధుమేహం నిర్ధారణ అయినవారి సంఖ్య. టెస్ట్ చేయించుకోనివారిలో ఈ వ్యాధి ఎంతమందికి ఉందో అంచనా కట్టలేం.

లక్షణాలు:
ఎక్కువగా మూత్ర విసర్జన, అధికంగా దాహం, ఆకలి వేయడంతో పాటు బరువు తగ్గడం, దృష్టిలోపం, అలసట, గాయాలు మానకపోవడం, చర్మం దురదగా అనిపించడం.

రెండు రకాలు :
ఒకటి గర్భంతో ఉన్న వారికి, పురిటి పిల్లలకు వస్తుంది. వీరు వైద్యుల సలహాలు పాటించి ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు పాటించడం వలన కాన్పు తరువాత, బిడ్డ పుట్టిన నెల తరువాత వీరు సాధారణ పరిస్థితికి వస్తారు.
రెండో దశలో వచ్చే మధుమేహం జీవితకాలం మనతోనే ఉంటుంది. దీనిని కేవలం మందులు, సరైన ఆహారం, వ్యాయామాలతో అదుపులో ఉంచుకోవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే..

మధుమేహంతో బాధపడే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, వైద్యుల సూచనలు పాటించకపోతే నియంత్రణ సాధ్యంకాదు. దీని ప్రభావం శరీరంలోని పలు అవయవాలపై పడి వాటిని దెబ్బతీయడంతోపాటు చివరకు ప్రాణాలే బలిఅవుతాయి. ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, నరాలు దెబ్బతినడం(డయాబెటిక్ న్యూరోపతి), కిడ్నీ సమస్యలు, దృష్టిలోపం(డయాబెటిక్ రెటినోపతి) వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పాదాల, చర్మ, దంతాల, జీర్ణ, లైంగిక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పూర్తిగా నయం చేస్తామనేవారి మాటలు నమ్మొద్దు



ప్రస్తుత జీవన విధానంలో వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం బారిన పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం సురక్షితం. అలాగే మధుమేహ బాధితులు 3-4 నెలలకు ఒకసారి అవసరమైతే రెండు వారాలకు ఒకసారి ఈ పరీక్షలు చేసుకుంటూ తగు జాగ్రత్తలు పాటించాలి. మధుమేహాన్ని పూర్తిగా తగ్గిస్తామనే వారి మాటలు నమ్మి నాటు మందులు, ఇతర కషాయాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.

- డాక్టర్ అలోక్ సచిన్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, స్విమ్స్

సొంత నిర్ణయాలు వద్దు



మధుమేహంతో తీవ్రంగా ఇబ్బంది పడే వారు అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండే ఆస్పత్రుల్లో మాత్రమే చూపించుకోవడం సురక్షితం. మధుమేహ బాధితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఖరీదైన మందులు, ఇన్సులీన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని కూడా డాక్టర్లు చెప్పిన విధంగానే వాడాలి. ప్రధానంగా మధుమేహ బాధితులు ఆహారం, వైద్యం వంటి విషయాల్లో సొంత నిర్ణయాలు తీసుకోకూడదు.

- డాక్టర్ తులసీరాం, ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్, రుయాస్పత్రి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక వల్ల ప్రయోజనం ఉంటుంది.
● ఒత్తిడిని తగ్గించుకోవాలి. ● చక్కెరతో చేసిన పదార్థాలు, స్వీట్లు, సిరప్‌లు వంటి వాటి జోలికి పోరాదు.
● ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.
● క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.


వేములపాటి అజయ్ - వెంకటేష్


శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్, అల్లు అర్జున్ సోదరుడు అల్లు వెంకటేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,283
తలనీలాలు సమర్పించినవారు: 22,583



‘పద్మావతి’లో ‘నృత్య వాహిని’




తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ‘నృత్య వాహిని’ మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం వీసీ ఉమ ప్రారంభించారు. కళల ద్వారా మనుషుల్లో సమైక్యతా భావన పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. దేశ, విదేశీ ప్రతినిధులతో నృత్యోత్సవం నిర్వహించడం ద్వారా యూనివర్సిటీ విద్యార్థినుల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. మనకు వారసత్వంగా సంక్రమించిన నృత్యాలను పరిరక్షించుకోవాలని, దీనికి యూనివర్సిటీలో సంగీత, నృత్య విభాగం ఎంతో కృషి చేస్తుందన్నారు. నృత్యాలను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడం అవుతుందని మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ అన్నారు. ఆయా ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులతో అలరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, హ్యూమనిటీస్ డీన్ వాణి, అంతర్జాతీయ డీన్ విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కార్యదర్శి హిమబిందు, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.


నృత్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఉమ

ఇథనాల్ ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న జడ్పీటీసీ కట్టా జ్యోతి, వేదికపై ఆర్డీవో కిరణ్మయి, కాలుష్యనియంత్రణ శాఖ ఈఈ ఆదిశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని కోనేటిరాజుపాళెంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షత వహించారు. అటవీశాఖ సమక్షంలో నయరా ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. 400 కెఎల్‌పీడీ నూరుశాతం సామర్థ్యంతో ఇథనాల్ తయారీతోపాటు 10.3 మెగావాట్ల జనరేషన్ పవర్‌ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటవుతుందని ఆర్డీవో తెలిపారు. పరిశ్రమకు సంబంధించి పూర్తి వివరాలను యాజమాన్యం ప్రతినిధి సుజిత్‌తోపాటు పలువురు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న యాజమాన్య ప్రతినిధులు సమీపంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని జడ్పీటీసీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్‌లు కోరారు. అనంతరం సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది రైతులకు సంబంధించి ఇరిగేషన్ పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు రహదారుల అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులను సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, సీఐ సంఘమేశ్వరరావు, ఓజిలి ఎస్‌ఐ శ్రీకాంత్, మాజీ సీడీసీ ఛైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్యపై కోపంతో అత్తింటికి నిప్పు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి అత్త వారింటికి పెట్రోలు పోసి నిప్పు పెట్టిన ఘైనమిది. అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. చిల్లకూరు మండలం వల్లివేడుకు చెందిన ఏడుకొండలికి కోట మండలం కొత్తపాలేనికి చెందిన శిరీషతో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. రెండేళ్ల నుంచి అనుమానంతో భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. గురువారం ఏడుకొండలు అత్తవారింటికి వచ్చాడు. భార్యతో గొడవ పడి కొట్టాడు. ఆమె కోపంతో మరో గదిలోకి వెళ్లిపోయింది. ఈలోగా ఏడుకొండలు వెంట తెచ్చుకున్న పెట్రోలు తీసి గదిలో పోసి నిప్పంటించాడు. ఇంట్లో వారు గుర్తించి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే గదిలో అప్పటికే రూ.4లక్షల విలువైన ఫర్నిచర్ దగ్ధమైంది. అగ్నిమాపక శకటం వెళ్లి మంటలను ఆర్పివేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.14.5 లక్షల సాయం

● బైర్గన్ పరిశ్రమ ఉదారత


వరదసాయంతో పాటు వివిధవస్తువులు కలెక్టర్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళూరు రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో ముంపుబారిన పడిన కళత్తూరు హరిజనవాడ, మరో రెండు గ్రామాల బాధితులకు రూ.14.5 లక్షల సాయం అందింది. శ్రీసిటీలోని బైర్గన్ పైప్ సపోర్ట్ పరిశ్రమ నిర్వాహకులు రూ.10లక్షల సాయంతో పాటు రూ.4.5 లక్షల విలువైన 1,200 ఎల్‌ఈడీ బల్బులు, 750 దుప్పట్లు, 75 టేబుల్‌ఫ్యాన్లు అందజేశారు. వీటిని ఆ పరిశ్రమ ప్రతినిధి అల్తాఫ్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. ఆ పరిశ్రమ ఉదారతను కొనియాడుతూ.. మరికొంతమంది సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

‘అరణియార్’లోకి ఆరు లక్షల చేప పిల్లలు


రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి నీళ్లు చేరడంతో గురువారం ఆరు లక్షల చేపల పిల్లలను వదిలారు. మరో ఐదు రోజుల్లో ఇంకో నాలుగు లక్షల చేప పిల్లలు వదలనున్నారు. ఈ రిజర్వాయరులోని చేపలకు అటు చెన్నై, ఇటు నెల్లూరు, తిరుపతిలో మంచి గిరాకీ ఉందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ చేపలకు మార్కెట్ కల్పిస్తే మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డీఎఫ్‌వో శాంతి, ఎఫ్‌డీవో మధుసూదన్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో మహ్మద్‌రఫి, అరిణియార్ ఆయకట్టు ఛైర్మన్ రవిరెడ్డి, నాయకులు వాసురెడ్డి, ఎస్.ఎం. సురేష్, సుమాంజలి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసర్‌లో భారత శాస్త్ర అకాడమీ సదస్సు

● 150 మంది శాస్త్రవేత్తల రాక

ఏర్పేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో బెంగళూరుకు చెందిన భారత శాస్త్ర అకాడమీ ఆధ్వర్యంలో 91వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. మూడు రోజుల పాటు తిరుపతి ఐసర్‌లో జరగనుంది. సర్ సీవీ రామన్ 1934లో స్థాపించిన ఈ అకాడమీ.. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ అకాడమీ శాస్త్రీయ ఆలోచన, జ్ఞాన మార్పిడి, విజ్ఞాన విద్య, పరిశోధనలను దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో జరిగే 91వ వార్షిక సదస్సులో దేశంలోని 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొని.. పరిశోధనలను పరిచయం చేస్తారు. అకాడమీ ఫెలోషిప్ అసోసియేట్లు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆహ్వానితులు శాస్త్రీయ చర్చలు, ఆలోచనల మార్పిడి జరుపుతారు. ఐఐఎస్‌సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ ‘వైరల్ వ్యాక్సిన్ల స్థిరత్వం, ప్రభావాన్ని పెంపొందించడం’ అంశంపై అధ్యక్ష ప్రసంగం చేస్తారు. పబ్లిక్ లెక్చర్‌గా ‘ఏఐ ఫర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్’పై ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కల్యాణ రామన్ మాట్లాడనున్నారు. ప్రత్యేక సింపోజియాలు, లెక్చర్లతో పాటు లీలావతీస్ డాటర్స్ పుస్తకాన్ని కన్నడ, ఒరియా భాషల్లో ఆవిష్కరిస్తారు. విద్యార్థుల కోసం విజ్ఞాన కథలు పేరుతో మధ్య పాఠశాల విద్యార్థుల కోసం విజ్ఞాన అవగాహన కార్యక్రమం 14, 15 తేదీల్లో అవుట్‌రీచ్ కార్యక్రమం ఉంటుంది. అకాడమీ అధికార యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సదస్సులో నేడు: శుక్రవారం ఉదయ 8.45గంటలకు రిజిస్ట్రేషన్, 9.10 నుంచి 10.30 వరకు బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ అధ్యక్ష ప్రసంగం, 11.45గంటలకు ప్రజా ఉపన్యాసం, 12.30గంటలకు గ్రూప్ ఫొటో, 2 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు, 3.20గంటలకు టీ విరామం, 4గంటలకు ఫరీదాబాద్ టీహెచ్‌ఎస్‌టీఐ ప్రొఫెసర్ డాక్టర్ శింజని భట్నాగర్ ఉపన్యాసం, 4.40గంటలకు ప్రత్యేక సమావేశం, 6.10 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు,



లారీ చోరీ కేసులో క్లీనర్ అరెస్టు


దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాను క్లీనర్‌గా పనిచేస్తున్న లారీని డ్రైవర్ లేని సమయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి గురువారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పలమనేరుకు చెందిన మధుసూదన్‌నాయుడు లారీ యజమానిగా వస్తు రవాణా సాగిస్తుంటాడు. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటకు చెందిన కన్నయ్యనాయుడు ఆ లారీకి డ్రైవర్‌గా, ఇదే పట్టణం బహదూరుపేటకు చెందిన జయచంద్ర(45) క్లీనర్‌గా పని చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం నెల్లూరు నుంచి ఖాళీ లారీతో పలమనేరుకు వెళుతూ శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని బసవయ్యపాళెం వద్ద విశ్రాంతి కోసం ఆగారు. ఈ సమయంలో డ్రైవర్ కన్నయ్యనాయుడు ఇంటికి వెళ్లడంతో క్లీనర్ జయచంద్ర లారీని చోరీ చేశాడు. యజమాని మధుసూదన్‌నాయుడు ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద గురువారం లారీ సహా క్లీనర్ జయచంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

‘గ్రేటర్’లో విలీనానికి కరకంబాడి ఓకే

రేణిగుంట/తిరుపతి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనానికి కరకంబాడి పంచాయతీ బోర్డు ఆమోదించింది. కలెక్టర్ ఆదేశాలు మేరకు రేణిగుంట మండలం పరిధిలోని కరకంబాడి, రేణిగుంట, గాజులమండ్యం పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పంచాయతీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో కరకంబాడి పంచాయతీ పాలకమండలి కార్పొరేషన్‌లో విలీనానికి ఆమోదించారు. కోరం లేనందున రేణిగుంట పాలకమండలి సమావేశం వాయిదా పడింది.

మేము కలవలేం : తిరుపతిరూరల్‌మండలం రామానుజపల్లె పంచాయతీకార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గ్రామసర్పంచ్, వార్డుసభ్యులు కలసి గ్రేటర్‌తిరుపతిలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయతీగానే ఉంచాలని కోరారు.గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులభారం పెరుగుతుందని, పలు సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సర్పంచ్ లీలారాణి, వైస్‌సర్పంచ్, వార్డుసభ్యులు, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ పాలకమండలి కూడా కార్పొరేషన్‌లో విలీనాన్ని తిరస్కరించింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదేశించారు. తిరుపతిలోని విద్యుత్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈఈలు, ఈఈలు, ఎస్‌ఈలు, జీఎం, సీజీఎం స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి సత్వర సేవలందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు రాకుండా లోడ్ నియంత్రణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదుల సంఖ్యను తగ్గించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. 11కేవీ ఫీడర్లకు, డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. నెలవారీగా విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహనరావు, సీజీఎంలు జె.రమణాదేవి, ఎన్.శోభావాలెంటీనా, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరామ్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

◆ నా మాటకు విలువలేనప్పుడు

ఎందుకీ ఇన్‌చార్జి పదవి?

● గంగమ్మ గుడిలో మెంబరునూ వేసుకోలేకపోయా
● టీడీపీ ముఖ్యనేతల ఎదుట సుగుణమ్మ ఆవేదన

తిరుపతి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ‘తాతయ్య గుంట గంగమ్మ గుడిలో ఒక మెంబరునూ వేసుకోలేకపోయా. నాకు సమాచారం లేకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. నా మాటకు విలువ లేనప్పుడు నాకెందుకీ ఇన్‌చార్జి పదవి?’ అంటూ ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, నాలెడ్జ్ కమిటీ ఛైర్మన్ మాల్యాద్రి, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ సమక్షంలో గురువారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇంచార్జిలు, కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘2019 ఎన్నికల్లో నేను గెలిచానో, ఓడిపోయానో అందరికీ తెలుసు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నిక వైసీపీ అధికారబలంతో రాష్ట్ర వ్యాప్తంగా చేజిక్కించుకుంది. అయితే తిరుపతి నియోజకవర్గాన్నే భూతద్దంలో చూపించారు. అయినా ప్రతిపక్షహోదాలో తిరుపతిలోని కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చాను. 2024లో టికెట్ వస్తుందని ఆశించా. కూటమి పొత్తులో భాగంగా మిత్రపక్షమైన జనసేనకు సీటు పోయింది. ఆ సమయంలో కాస్త అసంతృప్తి చెందిన మాట వాస్తవమే. అవన్నీ పక్కన పెట్టి అందరినీ కలుపుకుని పోయి అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించుకున్నాం. ఈక్రమంలో వచ్చిన నామినేటెడ్ పోస్టులు కొంత అసంతృప్తి కలిగించాయి. గంగమ్మ గుడిలో మెంబరుగా కూడా నేను సూచించిన వ్యక్తికి రాకపోవడం బాధకలిగింది’ అని సుగుణమ్మ వాపోయారు. వైసీపీ నాయకుల పట్ల కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే అధికారంలో ఎవరున్నారన్న అనుమానం కలుగుతోందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు దిక్కులేకుండా పోయిందని సూరా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదవులంటే ఒకే కుటుంబమేనా? వారికే పదవులా? తిరుపతి టీడీపీలో ఇంకెవరూ లేరా అంటూ బీజీ కృష్ణ యాదవ్ ప్రశ్నించారు.

గ్రూపులు వదిలేయండి.

సుగుణమ్మ, ఆమె అల్లుడు సంజయ్ 2019 ఎన్నిక సరిగ్గా చేసుంటే ఇప్పుడు ఆమె మంత్రి అయ్యేవారని మాల్యాద్రి చెప్పారు. వర్ల రామయ్య మాట్లాడుతూ 2009లో ఎంపీగా పోటీ చేసినప్పుడు 45 నిమిషాలు ముందు చెబితే తాను నామినేషన్ వేశానని గుర్తుచేసుకున్నారు. కొందరి వల్ల ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. గ్రూపులు వదిలేసి అందరినీ కలుపుకుని పోవాలని అటు సుగుణమ్మకు, ఇటు పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ ఆదేశాల ప్రకారం నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు.



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న వర్ల రామయ్య, టీడీపీ నేతలు